సాక్షి
విజయనగరం

బుధవారం । 1 । జనవరి । 2025



320 మంది హాజరు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రెండోరోజు చేపట్టిన దేహదారుఢ్య పరీక్షలకు 600 మందికి 320 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అందరికీ మంచి జరగాలి : కలెక్టర్



విజయనగరం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరూ ఆనందంతో ఆరోగ్యంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

న్యూస్‌రీల్

జెడ్పీలో కారుణ్య నియామకాలు



ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయంలో కొందరికి పదోన్నతులు, మరికొందరికి కారుణ్య నియామకం చేస్తూ ఉత్వర్వులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. కారుణ్య నియామకం పొందిన వారిలో పి.రాధాకృష్ణ, (జీఎల్‌పురం ఎంపీడీఓ కార్యాలయం), ఎల్.రాజేశ్వరి (ఎంపీడీఓ కార్యాలయం పూసపాటిరేగ), ఎస్.యశస్విని (అలమండ ఉన్నత పాఠశాల) ఉన్నారు. పి.సన్నిబాబు (కొమరాడ ఎంపీడీఓ కార్యాలయం), కె.భాస్కరరావు (జూనియర్ సహాయకులుగా ఎంపీడీఓ కార్యాలయం, జీఎల్‌పురం), ఎస్.చంద్రశేఖర్ (ఉన్నత పాఠశాల, ఉత్తరావల్లి)లకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఉత్తర్వులు అందుకున్న వారంతా చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనది

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



దేవుడును సన్మానిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

గంట్యాడ: అన్ని వృత్తుల్లో కంటే ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు గంట్యాడ మండలంలోని పెదమధుపాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కిలపర్తి దేవుడు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివానని తెలిపారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన, సేవాగుణాన్ని అలవర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో విశాఖపట్నం సీబీఐ ఎస్పీ రంభ మురళి, డీఈఓ మాణిక్యాల నాయుడు, ఎంఈఓ విజయకుమారి, సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలోనే అధిక పింఛన్లు



జొన్నవలసలో పింఛన్లు అందజేస్తున్న మంత్రి, తదితరులు

విజయనగరం రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్ద మొత్తంతో పాటు ఎక్కువ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు రాష్ట్ర సెర్ప్, ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జొన్నవలస గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతి రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రలోని తెలుగు వారందరి మోములలో 2025 సంవత్సరం వెలుగులు నింపాలని, వారి జీవితాలలో సకల శుభాలు జరగాలని ఆకాంక్షించారు.

అత్యాచార ఘటనపై ఆందోళన



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

విజయనగరం అర్బన్: జి.మాడుగుల మండలం గాంధీనగర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాచార ఘటనకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలన్నారు. దీనిపై సమగ్ర నివేదికను అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్‌లో చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



కోటి ఆశలతో స్వాగతం

- నూతన సంవత్సర శుభాకాంక్షలు

కష్టసుఖాలు మిగిల్చిన 2024వ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త సంవత్సరం 2025లో 12 నెలలు సంతోషంగా.. 52 వారాలు ఆరోగ్యంగా..365 రోజులు విజయవంతంగా గడవాలి. ప్రజలందరి జీవితాలు ఆనందంగా.. ఆరోగ్యంగా ఉండాలి. కలలు, ఆశలన్నీ నెరవేరాలి. భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలి. అందరి జీవితాల్లో కోటి వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని హుకుంపేటలో గల మయూరి నృత్యాలయం చిన్నారులు నూతన సంవత్సరం రాకను ఆహ్వానిస్తూ మంగళవారం అర్ధరాత్రి కొవ్వొత్తుల వెలుగుల్లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అనాథలైన తల్లిదండ్రులు

- కారు ఢీకొని కేజీబీవీ పాఠశాల టీచర్ దుర్మరణం
- కుటుంబాన్ని పోషిస్తున్న కన్నకూతురి మృతి



మృతురాలు నిష్టాల కమలరాణి (ఫైల్)

భోగాపురం: ఇంటిని పోషిస్తున్న కుమార్తె రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వృద్ధులైన ఆమె తల్లిదండ్రులు అనాథలయ్యారు. ఆ తల్లిదండ్రులు తమ కుమార్తెకు చిన్నతనంలోనే వివాహం చేశారు. అయితే దురదృష్టవశాత్తు వెంటనే ఆమె భర్త చనిపోవడంతో అప్పటి నుంచి ఉద్యోగం చేసుకుంటూ వృద్ధులైన తల్లిదండ్రుల వద్ద ఉంటూ వారి బాగోగులను చూసుకుంటూ వస్తోంది. ఇంతలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె ప్రాణాలు విడవడంతో వృద్ధ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో భోగాపురం కేజీబీవీలో వృత్తివిద్య ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయనగరంలోని భార్గవనగర్‌కు చెందిన నిష్టాల కమలరాణి(49) మృతి చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విధి నిర్వహణలో భాగంగా నైట్ డ్యూటీ చేసేందుకు సోమవారం సాయంత్రం పాఠశాలకు వచ్చిన ఆమె విధులు ముగించుకుని మంగళవారం ఉదయం తిరిగి పాఠశాల నుంచి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ఆమెను బలంగా ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. తోటి ఉపాధ్యాయుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు విడిచింది. ఆమె గతంలో రామభద్రపురంలో పని చేస్తూ 2023 ఆగస్టు 6న బదిలీపై ఇక్కడికి వచ్చారు. మృతురాలి తండ్రి రఘునాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

మాట మార్చడమే..
బాబు మార్క్ పాలన

- ఎన్నికలకు ముందు ఓ మాట.... గద్దెనెక్కిన తరువాత మరో మాట
- 6 నెలల పాలనలో హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం
- ప్రజలపై భారాలు మోపేలా ప్రభుత్వ చర్యలు
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై చిన్నచూపు
- నూతన సంవత్సరంలోనైనా ప్రభుత్వ పాలనలో మార్పు రావాలి
- అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షానే వైఎస్సార్‌సీపీ
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఎన్నికలకు ముందు ఓ మాట.. గద్దెనెక్కిన తరువాత మరో మాటతో రాష్ట్రంలో చంద్రబాబు మోసపూరిత మార్కు పాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. 2024 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాతీర్పుతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం గడిచిన 6 నెలల పాలనలో అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా, అధికారం కట్టబెట్టిన ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. జెడ్పీ కార్యాలయంలో తన చాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2025 కొత్త ఏడాదిలో ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, శాంతిభద్రతల విషయంలో సామరస్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలోనైనా పాలకుల ఆలోచన తీరులో మార్పు వచ్చి హామీలను అమలుచేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టారు. ఆయన మాటల్లోనే...

హామీల అమలులో వైఫల్యం

కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందింది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరిట చేసిన హామీల అమల్లో పింఛన్ల పెంపు మినహా మరే హామీ అమలుచేయలేకపోయారు. ఉచిత గ్యాస్ సిలిండర్‌ల మంజూరులో గడిచిన 6 నెలల్లో 1 సిలెండర్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేసేలా పాలన సాగిస్తోంది. ప్రధాన రంగాలను కార్పొరేట్ పరం చేసి పేద ప్రజలకు అందని ద్రాక్షలా చేస్తోంది.

ప్రజలపై మోయలేని భారం

ఓ వైపు నిత్యావసర ధరల పెంపును కట్టడిచేయక, మరోవైపు విద్యుత్ చార్జీలతో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మోయలేని భారం మోపుతోంది. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని, వీలైతే తగ్గిస్తామని ప్రకటనలిచ్చి నేడు ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట దోపిడీ చేస్తోంది. ఫిబ్రవరి నుంచి భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. మరోవైపు సర్వేల పేరులో పింఛన్ల తొలగింపునకు సన్నద్ధమవుతుండడం విచారకరం. కొత్త పింఛన్ల మంజూరు జాడేలేదు. కేవలం డిసెంబర్ నెలలో భర్తలు చనిపోతే భార్యలకు మాత్రమే వితంతు పింఛన్లు మంజూరు చేసి చేతులు దులపుకోవడం దురదృష్టకరం. ఈ ఏడాది జూన్ నుంచి భర్తలు చనిపోయిన భార్యల పరిస్థితి ఏమిటో చంద్రబాబే చెప్పాలి. ఇది మంచిపద్ధతికాదు.

అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సేవలందించే వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. గడిచిన ఐదేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగేలా పాలన సాగించిన వైఎస్సార్‌సీపీ.. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో జిల్లా ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తాం. ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం సన్నగిల్లింది. గత వైఎస్సార్‌సీపీ పాలనకు, నేటి పాలనకు ప్రజలు బేరీజు వేసుకోవడం మొదలుపెట్టారని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు వర్రి నర్సింహమూర్తి, గార తౌవుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, పార్టీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

విచారణలో గోప్యత

- ఇలా వచ్చి... అలా వెళ్లిన ఆర్‌ఎం
- తూతూ మంత్రంగా భైరిపురం గోదాంలో బియ్యం కాజేతపై విచారణ



భైరిపురం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాం

మెరకముడిదాం: మెరకముడిదాం మండలం భైరిపురంలో ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గొదాంలో బియ్యం పక్కదారి పట్టడంపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. అక్రమాలపై విచారణ జరిపేందుకు మంగళవారం గోదాంకు వచ్చిన ఆర్‌ఎం రాజేశ్వరి గోప్యత పాటించారు. బియ్యం కాజేత అంశాన్ని పక్కనపెట్టి గోదాంలో ఎన్ని బస్తాలు బియ్యం స్టాక్ ఉంది.. రికార్డుల్లో పొందుపరిచిన స్టాక్, గోదాంలో ఉన్న స్టాక్ సరిపోయిందా లేదా అన్నదానిపైనే ఆరా తీయడం, దానిని కూడా గుప్‌చుప్‌గా నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తొలత గోదాంలో బియ్యం దొంగతనంపై నిగ్గుతేల్చేందుకు విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ వస్తారని తెలిసింది. ఆయన రాకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

సాఫ్ట్ స్కిల్స్‌పై కొత్త పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్ (మార్గాన్ని నావిగేట్ చేయడం–క్లాస్‌రూమ్ నుంచి బోర్డ్ రూమ్‌కి మారడానికి కీలక నైపుణ్యాలు) అనే పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విపక్ష నాయకుడు, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ బొత్స సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం ప్రత్యేకించి ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఇతర విభాగాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రచించిన సీతం కళాశాలలో ఇంగ్లిష్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.సతీష్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ వై.నరేంద్రకుమార్, లైబ్రేరియన్ డాక్టర్ ఎల్.సత్యవతి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

28న పైడితల్లి అవతరణ దినోత్సవం



మాట్లాడుతున్న పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు సూర్యపాత్రో

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి అవతరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో పేర్కొన్నారు. స్థానిక చదురుగుడి ఆవరణలో మంగళవారం అమ్మవారి దీక్షాపరులు, కమిటీ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 28 అమ్మవారి అవతరణ దినోత్సవం రోజు ఉదయం 9 గంటలకు కోట వద్ద భక్తులందరూ ర్యాలీగా వచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని మెయిన్‌రోడ్డు, గంటస్తంభం, కన్యకపరమేశ్వరీ ఆలయం, డాబా గార్డెన్స్, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడికి చేరుకుని అక్కడ నిర్వహించే చండీహోమంలో పాల్గొంటారన్నారు. అనంతరం అమ్మవారి జీవిత చరిత్రతో కూడిన సావనీర్‌ను ఆవిష్కరిస్తారన్నారు. సమావేశంలో సాగి శివసీతారామరాజు స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు నాలుగెస్సుల రాజు, ఎస్. అచ్చిరెడ్డి, బొంగ మహేష్, అయ్యప్పగురుస్వామి శ్రీను, డీవీవీ.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ గ్రామాల పునర్నిర్మాణానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: సామాజిక కార్యకర్తల పనితీరు బాగున్నప్పుడే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలిస్తాయని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో 'భారతీయ గ్రామాల పునర్నిర్మాణం' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పల్లెల పునర్నిర్మాణానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. పలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. సదస్సులో వర్సిటీ వీసీ టీవీ కట్టిమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేట్ హైవేలుగా రెండు రోడ్లకు ప్రతిపాదన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని రెండు ప్రధాన రోడ్లను రాష్ట్ర రహదారులుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేస్తూ సమగ్ర ప్రాజెక్టు నివేదికలను రూపొందిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. విజయనగరం–పాలకొండ (72 కిలోమీటర్లు), నెల్లిమర్ల–రణస్థలం (28 కిలోమీటర్లు) రోడ్లను స్టేట్ హైవేలుగా ప్రతిపాదించామన్నారు. రోడ్లు భవనాలశాఖ ప్రగతిపై కలెక్టర్ తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. గుంతలు లేని రహదారులే లక్ష్యంగా జిల్లాలో 884 కిలోమీటర్ల మరమ్మతులకు 176 పనులను ప్రతిపాదించామని, ఇప్పటి వరకు 31 పనుల్లో 259 కిలోమీటర్ల మేర పనులు పూర్తయినట్టు వెల్లడించారు. మిగిలినవి ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. పనులను వెంటవెంటనే పూర్తి చేయడంతో పాటు బిల్లులను త్వరితగతిన అప్‌లోడ్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమణి, ఈఈ ఎం.జేమ్స్, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

ఈ నెల 3వ తేదీ నుంచి జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదువుతున్న 4,660 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. 9 కళాశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్, మిగిలిన 9 కళాశాలల్లో వాటికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల భోజన నిర్వాహకులతో భోజనం వడ్డిస్తామని తెలిపారు. డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణకు పథకం అమలుపై పలు సూచనలు చేశారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని రెండు నెలలు పాటు పెంచుతూ సమాచార పౌర సంబంధాల సంచాలకులు హిమాన్షు శుక్లా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జనవరి 1, 2025 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు పెంపు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడంగానీ ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డిసెంబర్ 31, 2024 నాటికి అక్రిడేషన్ కార్డులు కలిగి పని చేయుచున్న పాత్రికేయులకు మాత్రమే జనవరి 1, 2025 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని ఆ ఆదేశాల్లో సంచాలకులు తెలియజేశారు.

ఏపీఓపై ఎందుకంత ప్రేమ..!

- అరకోటికి పైగా స్వాహా చేసినా చర్యలు శూన్యం
- నిబంధనలకు విరుద్ధంగా రెన్యువల్ చేసిన వైనం

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసే ఓ అదనపు ప్రోగ్రాం అధికారి (ఏపీఓ)పై జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు వల్లమాలిన ప్రేమ చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిహామీ నిధులు అరకోటికిపైగా స్వాహా చేసినా అతనిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఏపీఓ అక్రమాలపై డ్వామా రాష్ట్ర స్థాయి అధికారులు ఇటీవల విచారణ జరిపారు. 2014–15లో రూ.51.19 లక్షలు, 2016–17లో రూ.50,298, 2018–19లో రూ.16,435లు ఆయన నుంచి రికవరీ చేయాల్సి ఉందని నిర్ధారించారు. రికవరీ మాత్రం ఎక్కడివేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారింది. డ్వామాలో కింది స్థాయి అధికారులను సంబంధిత ఏపీఓ మేనేజ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా రెన్యువల్

ఏటా ఏపీఓ కాంట్రాక్ట్‌ను రెన్యువల్ చేస్తుంటారు. రికవరీ సొమ్ము రూ.20 వేలు కంటే ఎక్కువ ఉంటే రెన్యూవల్ చేయడానికి నిబంధనలు వర్తించవు. రికవరీ రూ.లక్షల్లో పెండింగ్ ఉన్నప్పటికీ అధికారులు ఆయన కాంట్రాక్ట్‌ను రెన్యువల్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయాన్ని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి వద్ద ప్రస్తావించగా ఇటీవలే విధుల్లో చేరానని, ఏపీఓ రికవరీకి సంబంధించిన ఫైల్ ఇంకా చూడలేదని, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఐక్యతతోనే అభివృద్ధి



ఉత్తరాంధ్ర సమన్వయ సదస్సులో మాట్లాడుతున్న సంఘ నాయకులు ఎజ్జు మురళీకృష్ణ, లోకం ప్రసాద్ తదితరులు

విజయనగరం టౌన్: తెలగ కులస్తుల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎజ్జు మురళీకృష్ణ అన్నారు. అయ్యన్నపేటలోని ఆయన స్వగృహం ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆ సంఘ ఉత్తరాంధ్రా సమ న్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ స్టేటస్ సాధించేవరకూ పోరాటం చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మిరాకిల్ సంస్థ అధినేత లోకం ప్రసాద్, సంఘ నాయకులు రవీంద్రనాథ్ ఠాగూర్, ఆభరి ప్రసాద్, రొక్కం సూర్యప్రకాశరావు, ద్వారపు అజిత్ కుమార్, పులప రవీంద్రనాథ్ ఠాగూర్, పిళ్లల రామకృష్ణారావు, ముంగం నారాయణరావు, అధిక సంఖ్యలో ఉత్తరాంధ్ర కులపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.